# కదిరమ్మ పేరంటాలు

కదిరమ్మ పేరంటాల కథ ఎవరికి తెలియదు?

వెన్నెట్లో వెలిసిన పేరంటాలు. కదిరమ్మ తడి మేఘాల చీరకడుతుంది.

కొప్పునిండా నక్షత్రాలు తురుముకుంటుంది.

ఆమె ఆత్మ ఎపుడూ గ్రామం చుట్టూ తిరుగుతూంటుంది. అప్పుడప్పుడు పెద్ద ముత్తయిదువులకి రాత్రిళ్ళు పోలాల్లో తిరుగుతూ కనిపిస్తుంది పేరంటాలు. ఎవరి జోలికి రాని చల్లని తల్లి. కదిరమ్మ పేరంటాలు శాంతించిన తరవాతనే వర్షాలు పడతాయంటారు. మామూలు వర్షాలు కావు. భూమ్యాకాశాలు కలిసిపోతాయి. చెరువులు పొర్లి గట్లు తెగిపోతాయి. మొలలోతు నీళ్ళు ఊళ్లోకొస్తాయి. అప్పుడామె శాంతిస్తుంది. బ్రహ్మంగారి మఠం నుంచి క్రితం ఏడాది సాధువువచ్చి అదే చెప్పేడు. కదిరమ్మ పేరంటాలు మీద అప్పటికప్పుడు పాటకట్టి పాడేడు సాధువు. ఆ మర్నాడే ఊళ్లో ఎవరికొ ఒంటి మీద కొచ్చింది.

ఊళ్లో అమ్మమ్మలు నాన్నమ్మలు రాత్రిళ్లు చిన్న పిల్లలకి కదిరమ్మ కథ చెప్తూంటారు. ఆమె కట్టెలు లేకపోయినా పొయ్యి వెలిగించేది. కదిరమ్మ పేరంటాలు తనకి తెలుసుననీ ఆమెతో మాటాడేననీ చెప్పగానే చిన్నపిల్ల కళ్లు ఆశ్చర్యంతో పెద్దవవుతాయి. కథంతా వింటూ కళ్లు మూతలు పడే ముందు చిన్నపిల్ల అడుగుతుంది.

"మరి వానలెప్పుడొస్తాయి"

❖ ❖ ❖

కరువుకి తెల్లకందువాలా ఉంది.

బయట పొలాలకి కప్పిన ఖఫన్‌లా ఉంది వెన్నెల.

మలుపేదో తిరిగి చటుక్కున ఆగింది బస్సు. విరిగి ముక్కలైనంతపనైంది. బస్సుదిగి కెమెరా సంచీ, బట్టలసంచీ రెండు భుజాలకీ తగిలించుకునినాతో దిగిన ఏడున్నర మంది ప్రయాణీకుల్ని దాటి రెండు సంచీలూ ఒకసారి దించుకుని ఒళ్ళు విరుచుకున్నాను. బస్సు రాత్రి అక్కడే ఆగిపోతుంది. ఏదో చీకటి దీవికి కొట్టు కొచ్చినట్టుగా ఉంది. అనంతపురం నాలుగైదుసార్లు వెళ్లినా జిల్లాలో మారుమూల ఈ గ్రామం దేశంలో ఎక్కడున్నా

తేడాలేదు. తొమ్మిది దాటింది. కొంచెం దూరంగా చీకటి దీవి లైట్ హౌస్‌లా ఒకే బల్బుతో వెలుగుతోన్న పాన్‌డబ్బా కనిపించింది. సంచీలో నీళ్ళు సీసాతీసుకుని గటగట ఖాళీ చేశాను. కిళ్లీ కొట్టుముందు రాతి బెంచీ మీద బరువు దించుకుని సిగరెట్లు కొనుక్కుని ఒకటి వెలిగించేను.

"నైజావా ఏంది?"

" ఆ. హైదరాబాదు."

" అదేలే మాట తీరు నైజాంలా ఉందితే. ఏందిటొచ్చినావు?"

" కదిరమ్మ జాతర ఫోటోలు తియ్యాలి."

" పోగులు రాకపోయా?"

కదిరమ్మ పేరంటాలు ఊరు ఇక్కడికి కింకా పదికిలోమీటర్లు. అసలు బస్సు తప్పిపోయి ఓ ప్రైవేటు చెక్కపెట్టె దొరికింది. తీరిగ్గా నాలుగు బిస్కెట్లు తిన్నాను.

" కోకకోల తాగరాదు?"

అతని కోసం నులివెచ్చని కోలా తాగేను. అరగంట తరవాత పాన్ డబ్బా ముయ్యడానికి సద్దుడు మొదలైంది. రెండే దార్లున్నాయి నాకు. ఒకటి ఏదో అరుగు చూసుకుని దొర్లడం. రెండు కిళ్లీకొట్టు యజమాని సహకారంలో సైకిలు సంపాదించడం రేపు ఉదయానికి అక్కడ ఉండాలి. కార్తీక బహుళ సప్తమి ఉదయం నుంచీ చుట్టు పక్కల గ్రామాల నుంచీ వేలాది మంది వచ్చి మొక్కులు తీర్చుకుని పేరంటాలుకి నైవేద్యం పెట్టుకుని వానలు బాగా పడాలి తల్లో అని వేడుకుంటారు. వేప చెక్కలో చేసిన కదిరమ్మ పేరంటాలు ముఖం నిండా పసుపు కుంకుమతో ఉగ్రంగా కనిపిస్తుందంటారు. పదేళ్లలో నాలుగు సార్లు వర్షాలు పడ్డాయి. వర్షం పడ్డ ఏడాది కదిరమ్మ ముఖం శాంతంగా ఉంటుంది. కరువు చిచ్చుకీ వర్షలకీ మధ్య పొలిమేరల్లో గ్రామస్తులు పేరంటాల్ని కాపలా దేవతలా పెట్టుకున్నారు. మిగతా రోజు లెలా ఉన్న జాతర రోజుమాత్రం పని గట్టుకుని రోజంతా గ్రామం మీద మబ్బులు ముసురుతాయి. జరుగుతున్నట్టుగానే కనిపించే ప్రభుత్వం కరువు కార్యక్రమాల్లాగే మబ్బులు చినుకులు పడ్డంత హడావుడీ చేసి చీకటి పడగానే చీలి వెళ్లి పోతాయి. ఎందుకో అమ్మవారికి ఆగ్రహం కలిగిందన్నమాట. జాతరకి ఆడవాళ్లే ఎక్కువ వస్తారు. పసుపుకుంకుమలిచ్చి బట్టలకి బదులు పసుపు దారాలు పాదాల దగ్గిర పెడతారు.

కదిరమ్మ గ్రామంలో రెండేళ్లలో ముగ్గురు రైతులు పురుగుమందు తాగి పొలంలో రుణం తీర్చుకున్నారు. సీసాలు లోపల పెడుతూ నా వెనక ఎవర్నో చూసి ఆగిపోయి అన్నాడు కొట్టు యజమాని.

"ఏందన్నా. ఈ వేలకి వచ్చినావు?"

వెనక్కి తిరిగి చూశాను. చీకట్లోంచి తలపాగా మోకాలి కిందికిరాని పంచా కొట్టు వేపు బస్తున్నాయి. వెలుగులోకి వచ్చేడతను. తలపాగా తీసి ముఖం తుడుచుకుని రొంటి నుంచి తడిసిన అయిదుకాయితం ఇచ్చి చుట్టలడిగేడు. చుట్టలిస్తూ నాతో అన్నాడు.

" నీ అదృష్టం. మా అన్న జాతరకి పోతా ఉండాడు. అన్నా బండేదీ?" నా గురించి చెప్పేడతను. అంతా విని చుట్ట వెలిగించి అన్నాడు.

"సరెపా."

బండికి గూడు లేదు. రెండు బిందెలు, నాలుగు మూటలమధ్య నేనూ కూచున్నాను. ఊరు దాటి కొంతసేపయింది. తెల్ల సిల్కులా గాలికి చలిస్తోంది వెన్నెల ఆకాశం శుభ్రంగా ఉంది. వెండి కంచంలో చెదిరి పోయిన మెతుకుల్లా ఆకాశానికి అతుక్కుపోయాయి నక్షత్రాలు. గాది రెడ్డి నిశ్శబ్దంగా చుట్టకాల్చుకుంటున్నాడు. చుట్టూరా వెన్నెట్లో కొండలు మెత్తటి దూదికొండల్లా ఉన్నాయి. రోడ్డు మీద బండి చక్రాలు చేసే శబ్దం తప్ప లోకం అంతా నిశ్శబ్దంగా ఉంది. మొత్తం భూమి మీద మేం ఇద్దరమే ఉన్నట్టుంది. చిన్న భయం కూడావేసింది. వెంటనే ఏదో మాట్లాడాలనిపించింది.

" అన్నా కదిరమ్మ పేరంటాల కద బాగ తెలుసానీకు?"

" అమ్మ కతా?" అని నవ్వేడతను. కాసేపాగి కథ చెప్పడం మొదలుపెట్టేడు.

❖ ❖ ❖

పంచాయితీ ఆఫీసు అరుగుమీద నాలుగు కుర్చీలు వేశారు. సర్పంచిగారూ, రెడ్డిగారూ, జిల్లా వ్యవసాయశాఖాధికారీ కూచున్నారు. రైతులందరూ పందిరికింద కూచున్నారు. వెనక వరస నుంచుని ఉన్నారు ఒక అరగంటసేపు విత్తనాల గురించీ రైతుల గురించీ అధికారి మాట్లాడేడు. ఆయన కూచుంటూండగా ఎమ్మార్వోగారు ఒచ్చేరు. కాసేపు అధికార కలకలం అయిన తరవాత కూచున్న డాయన. జవాను అందించిన నీళ్ల సీసా సగం ఖాళీ చేసేసరికి సర్పంచిగారు ఆయన్ని మాట్లాడాలన్నారు. అప్పటికే మూడు ఆత్మహత్యలు పూర్తయ్యాయి. ఎమ్మార్వోగారు రైతుల్ని పురుగుమందులు తాగొద్దనీ, తాగిన వారికి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉండి నష్టపరిహారం ఇస్తూనే ఉంటుందనీ చెప్పేరు.

కాస్త ఎండలో కాస్త నీడలో తలమీదుగా కొంగు కప్పుకుని చివరనోటిలో పట్టుకుని నిలబడింది కదిరమ్మ. అక్కడ నిర్లిప్తంగా ఎండిపోయి కూచున్న రైతుల్లో ఆమె భర్త లేదు. తిరుపతి రెడ్డికి అయిదెకరాల పొలం ఉంది. రెండేళ్లక్రితం ఖాళీ మేఘాలు ఓ సారి చినికి జిల్లా వదిలి వెళ్లిపోయాయి. ఆ బట్ట తడుపు నీళ్లలో విత్తనాలు ప్రాణం పోసుకోలేదు.

తిరపతి రెడ్డి కూడా కొంతమంది ఇతర రైతుల్లాగే చెమటతో ఒడికిన పచ్చకాయితాలు ఇచ్చుకుని ప్రాణం లేని గింజలు కొనుకున్నాడు. పొలం ఎండిపోయింది. అతనూ ఎండిపోయాడు మూడేళ్లక్రితం తీర్చవలసిన అప్పుమాత్రం పచ్చగా ఏపుగా ఉంది. కదిరమ్మ ఒంటి మీద అమ్మకానికి పనికొచ్చేవేవి లేవు. తనింకా బతికుండడంలో అర్థం కనిపించలేదు తిరపతికి. అప్పులు తీరేవి కావు. పంటలు పండే పరిస్థితీ లేదు. భార్యకి పదో పరకో నష్టపరిహారం ఇస్తారు. పురుగులమందు డబ్బా, గ్లాసూ, ఒత్తిగిలిపడున్న తిరపతిరెడ్డి శవాన్ని సాయంకాలం వరకూ ఎవరూ చూడలేదు.

మీటింగయి వెళ్లి గొళ్లెం తీసి ఖాళీ ఇంట్లోకి అడుగుపెట్టింది కదిరమ్మ. కుండలో మంచినీళ్లు తాగి గ్లాసు అడుగున కొంచెం నీళ్లుంచుకుని చుక్కకింద పడకుండా చేతిలో పోసుకుని చల్లటి చేత్తో మొహం తుడుచుకుందామె. రేకుకుర్చీలో కూచుని రెండు చేతుల్తో తలపట్టుకుని ఉండిపోయింది. రెడ్డి పోయిన కొన్నాళ్లకి బేంకు అప్పు తీర్చమని కాయితం వచ్చింది. రెండు మూడు సార్లు మిగతా రైతులు పెట్టుకున్న కాయితం మీద సంతకం పెట్టింది. కొన్నాళ్లు ఉత్తరాలు ఆగేయి. కానీ గడవడం కష్టమైపోయింది, ఈ లోగా బేంకు ఆఫీసరు మారడంలో మొదటికొచ్చింది. కొన్నాళ్లు రోడ్డుపనీ, కొన్నాళ్లు చెరువు పుడికపనీ అయింతరవాత మరోపథకం లేకుండాపోయింది. ప్రభుత్వం గంజికేంద్రాలు తెరుస్తుందని సర్పంచి చెప్పేడు. తెరిచారుగానీ అది పక్క ఊరికిపోయింది. కొన్నాళ్లకి ఎర్ర జెండాలు పాతి ఎవరో పార్టీ వాళ్లు గంజికేంద్రం నడిపేరు. ఊళ్లో సగానికి సగం ఓపికున్న యువకులందరూ ఊరొదిలి వెళ్లిపోయారు.

బేంకు తరపున వచ్చి అప్పుపడ్డ రైతులందరితో మాట్లాడి కదిరమ్మ ఇంటికొస్తాడతను. మామూలుగానే అతను బస్సు దిగేడంటే ఇళ్లలోకి తోడేలు వస్తోందనుకుంటారు. ఒక కాలు పొట్టిగా ఉన్న రేకు కుర్చీలో కూచుని అతను కదిరమ్మని కళ్లలో కమ్ముకుంటాడు. ఆమె అప్పు మీద కంటే ఆమె ఒంటిగురించే అతని కెక్కువ బాధ. అతను వచ్చి వెళ్లినప్పుడల్లా రెండ్రోజులు నిద్ర ఉండేది కాదు. ఉన్న నాలుగైదకరాల పొలం పోయిం తరవాత బిడ్డలకి మట్టికూడే పోరుగూర్లో అడుక్కు తినాల్సిందే. బిడ్డలు జ్ఞాపకం ఒచ్చినప్పుగల్లా ఎద్దుకుమ్మినట్టుండేది. తలమీద కొంగు కప్పుకుని ఊరికి రెండుకిలోమీటర్లు అవతలున్న చెరువు దగ్గిర పుల్ల లేరుకుని దుర్గమ్మ రాయిదగ్గిర కూచుంది కదిరమ్మ. బేంకువాడు రేపు వస్తాడు. చెప్పిమరీ వెళ్లేడు. దుర్గమ్మ రాయివేపు చూసిందామె. గట్టు మీద వెలిసిన దేవత ముఖం నిండా పసుపూ కుంకుమలు. ఎవరో ఆమె ముందుంచిన చక్కెర కోసం బారులుగా ఎర్రచీమలు అమ్మవారి మీదనుంచి ప్రయాణిస్తున్నాయి. నుదురు నేల మీద అనించి దణ్ణం పెట్టుకుందామె. రెండూర్ల ఆడామగా ఒచ్చి అమ్మవారికి దణ్ణం పెట్టుకుని

వెళ్తూంటారు. చెరువు పొంగి ఊరు మీద పడకుండా కాపాడ్డానికి దుర్గమ్మ వెలిసిందంటారు. సగం మూసుకున్న కదిరమ్మ తడి కళ్లముందు అమ్మ వారు మఠం వేసుక్కూచున్నారు. ఎర్రచీర, ముఖాన వెలిగిపోతున్న బొట్టు, అట్లాగే మెరుస్తోన్న చిరునవ్వుతో కదిరమ్మని చూస్తూ ఉండిపోయిందామె... గుండె తడిసిన పిట్టరెక్కల్లా కొట్టుకుంది. ఒళ్లంతా చల్లబడిపోయింది. చేతులు ఒణుకుతూండగా దణ్ణం పెట్టి మళ్లీ తల అమ్మ వారి ముందు వాల్చిందామె. ("వాన్లు కురిపిచ్చు తల్లీ") ఆమె తలని ఒళ్లో పెట్టుకుని కన్నీళ్లు అయిపోయేదాక తల నిమురుతూ ఉండిపోయింది అమ్మవారు. కాసేపటికి కళ్లు తెరిచింది కదిరమ్మ. దుర్గమ్మరాయి తనవేపు చూసి నవ్వుతున్నట్టుంది.

మెడ మీద చీమలు కుట్టేయి. పుల్లల మోపుతో గట్టుదిగి వెళ్లిపోయింది కదిరమ్మ.

కుర్చీలో ఎంతసేపు కూచుండిపోయిందో ఆమెకే తెలీదు.

"అప్పెట్టా తీర్చాలని ఆలోచిస్తాందావా?"

కుర్చీలోంచి కింద పడ్డంత పనైంది. గుమ్మం లోపలికొచ్చి నుంచున్నాడతను.

"కూచో అన్నా"

జాగ్రత్తగా రేకు కుర్చీ మీద కూచున్నాడతను. "ఆలోచించినావా? నీ గుమ్మం ఇన్నిసార్లు తొక్కేపని లేదునాకు. నేచెప్తా ఇను. నీకు వడ్డీ బాధలేకుండా జెస్తా. మళ్లీ బేంకు కాయితం రాదు. అయన్నీ ఏం జెయ్యాలో మాకు తెలుసు. ఇది ఆకరిసారి. ఇంకనే నడిగేదిలేదు.."

ఆమె ఏవీ అనలేకపోయింది. అతని వేపు చూస్తూండిపోయింది. అతను లేచి ఒంటి తలుపు చెక్క గొళ్లెంపెట్టి వచ్చేడు. గంట తరవాత జాగ్రత్తగా మళ్లీ తలుపు తీసుకుని వెళ్లిపోయాడతను. చాలారోజులు రాలేదతను. అతని బదులు బేంకు నుంచి అప్పుకట్టమని కాయితాలొచ్చేయి.

ఓ రోజు మధ్యానం మళ్లీ దుర్గమ్మ రాయిదగ్గిరికి వెళ్లింది కదిరమ్మ. అమ్మవారికి దణ్ణం పెట్టుకుని కళ్లు మూసుకుందామె. అమ్మవారు రాలేదు. ("సెడిందాన్ని గదా.") మరో నాలుగు రోజుల తరవాత ఓ రాత్రి కదిరమ్మ పొలానికి వెళ్లింది. వెన్నెట్లో కూడా పొలం వేడిగా ఉంది. మోకాళ్ల మీద ఒంగి నేల తల్లికి దణ్ణం పెట్టుకుందామె. పొలంలో వెలిసిన కరువుదేవతలా ఉంది కదిరమ్మ. తేరుకుని పక్కన పెట్టుకున్న సత్తు చెంబు తీసుకుంది.

బాగా పొద్దెక్కిం తరువాతగానీ కదిరమ్మ శవాన్ని ఎవరూ గమనించలేదు. చెదిరిపోయిన నీలంచీర పొలానికేసిన ఎరుపులా ఉంది కదిరమ్మ. నాలుగైదు నెలల

తరవాత ఓ మంగళవారం ఉదయం కదిరమ్మ ఓ అమ్మాయి ఒంటిమీది కొచ్చింది. సావిత్రికి పదహారేళ్లుంటాయి. ఉన్నట్టుండి విరుచుకు పడిపోయి జుట్టు విరగబోసుకుని నేను కదిరమ్మనంటూ శాపనార్థలు మొదలుపెట్టింది. అయిదు నిముషాల్లో గ్రామంలో ఆడవాళ్లందరూపోగయ్యారు. కొందరామెకి హరతిచ్చేరు. ముఖం మీద నీళ్లు చల్లి పెద్ద కుంకుమబొట్టు పెట్టేరు. కాకమీదున్న డప్పులా కొట్టుకుంటున్నాయి అందరి గుండెలూ. పెద్ద ఆడవాళ్లందరూ ఆమె చుట్టూ చేరి దణ్ణం పెట్టి శాంతింపచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. మరో పది నిముషాల తరవాత కదిరమ్మ హుంకరించింది. అరిచి అరిచి అలిసినోయి పడిపోయింది సావిత్రి. ఆమె కోలుకుని లేచేలోపల మరో ఇద్దరి ఒంటిమీది కొచ్చింది కందిరమ్మ. వారంలో ఊళ్లో మగవాళ్లిద్దరికి కళ్లో కనిపించింది కదిరమ్మ. కదిరమ్మ ఇంటి గుమ్మానికి పసుపు కుంకుమలు అద్దేరు. గుమ్మం ముందు రోజు ఎవరో ఒకరు తుడిచి ముగ్గులు పెడుతున్నారు. కదిరమ్మ కోరిపట్టుగా ప్రతీఏడాదీ గ్రామం కోసం, వర్షంకోసం, వివాహితుల మాంగల్యంకోసం కందిరమ్మ పేరంటాల సంబరాలు చేస్తున్నారు. కొంతమంది పిల్లలకి ఆమె పేరుపెట్టుకున్నారు. వేప చెక్కతో ప్రతి ఏడాదీ పేరంటాన్ని చేస్తారు. ముందు ఊరి పెద్దరెడ్డి అగరొత్తులు వెలిగించి నైవేద్యం పెడతాడు. పేరంటాలు రెడ్డింటి ఆడబడుచు. కదిరమ్మ మరణించిన తేది చూసి లెక్కవేసి సంబరం మూహూర్తం నిర్ణయిస్తాడు ఆచారిగారు. ఆ రోజు చెక్కతో అమ్మవార్ని చేస్తారు. సంబరం వారం ఉందనగా తప్పకుండా కదిరమ్మ ఒకరిద్దరి ఒంటిమీద కొస్తుంది. కదిరమ్మని దహనం చేసిన చోట సమాధి వెలిసింది.

. . .

చల్లటి వెన్నెల్లో కదిరమ్మ పేరంటాల కథ వెచ్చగా కమ్ముకుంది నన్ను. దూరంగా వెన్నెల్లో ఆమె తిరుగుతున్నట్టనిపించింది.

"పెద్దాయనా నీకు కదిరమ్మ పేరంటాలు తెలుసా?"

అతను నవ్వి అన్నాడు.

" నా బిడ్డే గదా. తెలవదా నీకు?"

❖ ❖ ❖